
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 12 జూలై 2024



రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి - 8లో..
తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు - 7లో..



వామ్మో డెంగ్యూ..



- జిల్లాలో నమోదవుతున్న కేసులు
- డెంగ్యూ లక్షణాలు, వైరల్ జ్వరాలతో బాధితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- ఈ ఏడాది ఇప్పటి వరకు నలుగురికి పాజిటివ్
- 23 హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు
- దోమల నివారణకు వారంలో రెండు రోజులు డ్రైడే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వైరల్ జ్వరాలతో సతమతమవుతున్న జిల్లా ప్రజలు డెంగ్యూతో భయపడుతున్నారు. రెండు రోజుల క్రితం జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలో డెంగ్యూ కేసు నమోదైంది. ఈ సంవత్సరంలో నాలుగు కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ బారిన పడి చికిత్స పొందుతున్నవారి సంఖ్య లెక్కలోకి రావడం లేదు. కొంతమంది హైదరాబాద్ వెళ్లి చికిత్స పొందుతున్నారు. మరోవైపు జిల్లాలో విషజ్వరాలతో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. నిత్యం ప్రతీ ఆసుపత్రిలో 150 నుంచి 300 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. చిన్న పిల్లలు జ్వరాలతో సతమత మవుతున్నారు. జ్వరాలతో ప్లేట్‌లేట్స్ పడిపోవడం, వైరల్ జ్వరాలైన డెంగ్యూ లక్షణాలుగానే భావిస్తూ ఆందోళన చెందుతున్నారు.

మరోవైపు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లక్షణాలతో పిల్లలు, వృద్ధులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. జిల్లా ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో ఏటా డెంగ్యూ కేసులతో ప్రజలు ఆందోళన చెందుతూనే ఉన్నారు. 2021లో 127 మంది, 2022లో 50 మంది, గతేడాది 20 మంది డెంగ్యూ బారిన పడ్డారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు నలుగురికి డెంగ్యూగా వైద్యాధికారులు గుర్తించారు.

దోమల స్వైర విహారం

జిల్లాలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నియంత్రణకు ప్రజలు స్ప్రేలు లిక్విడ్‌లు ఉపయోగిస్తున్నారు. మాస్టర్ ఫీవర్, రోమన్ ఫీవర్, ఇంటర్ మిటెంట్ ఫీవర్, ట్రాపికల్ ఫీవర్, కోస్టల్ ఫీవర్, ఇలా రకరకాల పేర్లతో పిలిచే చలి జ్వరాలు తెచ్చే దోమలతో జిల్లా ప్రజలు హడలిపోతున్నారు. ఈడీఎస్ దోమకాటుతో వచ్చే డెంగ్యూ నివారణకు ప్రధానంగా పరిశుభ్రత, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

డెంగ్యూ వ్యాధి లక్షణాలు

డెంగ్యూ ఎడీస్ ఈజిప్ట్ దోమతో వస్తుంది. ప్లేవీ సూక్ష్మ జీవి ద్వారా వ్యాపిస్తుంది. ఎడీస్ దోమలు పగటి పూటనే కుడుతాయి. చికున్ గున్యా కంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరిస్తుంది. డెంగ్యూ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. డెంగ్యూ వ్యాధి జ్వర పీడితులకు తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, కండరాలు, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, నొప్పితో కూడిన కంటి కదలికలు, వాంతులు, విరోచనాలు వంటివి కలుగుతాయి.



చికిత్స

డెంగ్యూ లక్షణాలు కనిపించగానే జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రులలో తగిన వైద్య సేవలు పొందాలి. డెంగ్యూ వ్యాధి ఎలీసా పరీక్ష ద్వారా నిర్ధారణ చేయవచ్చు.

హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో 17 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల్లో ఆరు ప్రాంతాలను డెంగ్యూ హైరిస్క్ ప్రాంతాలుగా వైద్యాధికారులు గుర్తించారు. వేములవాడ మండలంలో అనుపురం, నాంపల్లి, శాత్రాజు పల్లి, బోయినపల్లి మండలం గుండన్నపల్లి, కోనరావుపేట మండలం కనగర్తి, ఎల్లారెడ్డిపేట మండలం కంచర్ల, ఎల్లారెడ్డిపేట, హరిదాస్‌నగర్, వీర్నపల్లి మండలం రంగంపేట, ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల, తాళ్లపల్లి, ఆర్ అండ్‌ఆర్ కాలనీ చీర్లవంచ, లక్ష్మీపూర్, ముస్తాబాద్ మండలం కొండాపూర్, తంగళ్లపల్లి మండలం తంగళ్లపల్లి, మండెపల్లి, చంద్రంపేట, సిరిసిల్ల మున్సిపాలిటీలో రెడ్డివాడ, పద్మనగర్, శాంతినగర్, వేములవాడ మున్సిపాలిటీలో సాయినగర్, విద్యానగర్, భగవంతరావు నగర్‌ను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించిన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.

భయం వద్దు.. జాగ్రత్తలు మేలు

జిల్లాలో డెంగ్యూ, వైరల్ జ్వరాలతో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గడం, రక్తస్రావం తదితర సమస్యలు గతంలో కనిపించేవి. ప్రస్తుతం మెదడు, గుండె, కాలేయం తదితర అవయవాలపై ప్రభావం చూపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కీళ్లనొప్పులు కూడా పెరుగుతున్నాయి. జ్వరం వచ్చిన ప్రతీసారి డెంగ్యూగా భయపడవద్దని 90 శాతం మందిలో డెంగ్యూ మామూలు జ్వరంలాగే తగ్గిపోతుందని సరైన చికత్స తీసుకుంటే తీవ్రమైన జ్వరం కూడా ఇబ్బంది ఉండదని వైద్యులు సూచిస్తున్నారు. డెంగ్యూ నివారణకు టీకాలు లేవు. జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి బారిన పడకుండా చేయవచ్చు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి తొట్టిల్లో దోమలు చేరకుండా మూతలు బిగించుకోవాలి. కుండీల్లోని నీటిని తరచూ శుభ్రం చేయాలి. దోమలు గుడ్లు పెట్టే పూల తొట్టిలు, పాత టైర్లు, నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి.

రెండు రోజులు డ్రైడే



డ్రైడేలో పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

సీజనల్ వ్యాధులతోపాటు డెంగ్యూ జ్వరాల నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామ పంచాయతీల పరిధిలో వారంలో రెండు రోజులు డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డెంగ్యూపై విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు. గ్రామాల్లో ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించారు. గ్రామ పెద్దల సహకా రంతో ఇంటింటికి వెళ్లి నిల్వ నీటిని తొలగిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచవద్దంటూ ప్రచారం చేస్తున్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నారు. దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

చందుర్తి, జూలై 11 : ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన రమేష్, ఉపాధ్యాయులు చైతన్య, ఖలీద్, స్వప్నను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. మాజీ ఎంపీటీసీ గణేష్, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, రాజు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్‌మోహన్ రావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో జనాభా నియంత్రణపై అవగాహన కల్పించిన వైద్య సిబ్బందిని సన్మానించారు. వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసెక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్లు, ఇతర విధానాలను వివరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నయిమా, డాక్టర్ రవీందర్, కే పద్మలత, శ్రీదేవి, రాణి, సరోజన సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మయ్య, రాజ్‌కుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

రైల్వే లైన్ పనులు సకాలంలో పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 11: కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా జిల్లాలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఏడీ సర్వే శ్రీనివాస్, రైల్వే శాఖ అధికారులు మూర్తి, జనార్దన్, ప్రసాద్, ట్రాన్స్ కో ఈఈ హనుమంతు, డీఏఓ భాస్కర్, ఆర్ అండ్ బీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల కోసం తరలివచ్చిన రైతులు

వేములవాడ కల్చరల్, జూలై 11: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ కోడెల కోసం రైతులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామన్న ప్రకటనతో ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి రైతులు కోడెల కోసం గురువారం ఆలయానికి తరలివచ్చారు. దరఖాస్తు చేసుకున్నా తమకు కోడెలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం టోకెన్‌లు తీసుకున్నవారికి మాత్రమే ఇస్తున్నామని ఆలయ అధికారులు చెప్పారని, గురువారం ఉదయం గోశాల నుంచి కోడెలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మహిళా రైతులు ఆరోపించారు. ఆలయ ఏఈవో కార్యాలయం ముందుకు తరలి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆలయ అధికారులను వివరణ కోరగా రాజన్న ఆలయంలోని గోశాలలో పరిమితికి మించి ఉన్న కోడెల అందజేతకు ప్రకటన జారీ చేశామని, ఇప్పుడున్న కోడెలు మొక్కులు చెల్లించుకునేందుకు అవసరం ఉంటాయని తెలిపారు. మళ్లీ భక్తులు సమర్పించిన కోడెలను పేపర్ ప్రకటన ఇచ్చిన తరువాతనే అందజేస్తామన్నారు. అప్పటి వరకు కోడెలు ఇవ్వబోమని, రైతులు సహకరించాలని కోరారు.



ఈవో కార్యాలయం ఎదుట రైతులు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



వేములవాడలో..

సిరిసిల్ల క్రైం, జూలై 11:సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ సిరిసిల్ల కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి మాట్లాడుతూ సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్ ఓ కేసు విషయమై కక్షిదారు తరుపున మాట్లాడడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై ఉమారెడ్డి దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఏఎస్సైపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు.అంతకుముందు న్యాయమూర్తికి వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటి, కోశాధికారి బిట్ల విష్ణు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ : వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, అసోసియేషన్ కార్యదర్శి అవదూత రజనీకాంత్, న్యాయవాదులు విద్యాసాగర్, రాజు, కిషోర్‌రావు, దేవయ్య, సత్యనారాయణరెడ్డి, రాజ్‌కుమార్, మనోహర్, సంపత్, తాహిర్‌పాషా, పర్శరాములు, కనికరపు శ్రీనివాస్, అనిల్‌కుమార్, అజయ్, నాగేందర్ ఉన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్, జూలై 11 : ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా గురువారం పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సేవా కేంద్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజాపాలన దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్, ఈడీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 1: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఔత్సాహికులు ఆవిష్కరణల వివరాలు ఆగస్టు 3వ తేదీలోగా పంపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గురువారం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేషన్ 2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలతో ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఆవిష్కరణకు సంబంధించిన 6 వ్యాఖ్యాలు, 2 నిమిషాల నిడివి గల వీడియో, ఆవిష్కరణకు చెందిన 4 ఫొటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నంబరు, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు వంటి వివరాలను 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీపీఆర్వో శ్రీధర్, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో రమేష్ కుమార్, ఈడీఎం శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ అనిల్ పాల్గొన్నారు.

జీవరాశుల మనుగడకు చెట్లే ఆధారం



మొక్క నాటుతున్న డీఈవో

బోయినపల్లి, జూలై 11: జీవరాశుల మనుగడకు చెట్లే ఆధారమని డీఈవో రమేష్ కుమార్ అన్నారు గురువారం బోయినపల్లి మండలం విలా సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లు లేక పోవడంతో జీవరాసులు జనావాసాల్లోకి వచ్చి ఇబ్బందికి గురి చేస్తున్నాయన్నారు. చెట్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదవుతుందన్నారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులతో మొక్కలు నాటించాలని సూచించారు. డీసీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

సిరిసిల్ల రూరల్, జూలై 11: వ్యాపారాల్లో చేపట్టే మార్కెటింగ్, నగదు లావాదేవీలపై విద్యార్థులు ఇప్పటినుంచే అవగాహన పెంపొందించుకోవాలని అమెరికన్, ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు సీఎస్‌వీ శృతి, జస్ట్ అలెక్స్ మహేందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైజెస్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ప్రతినిధులతోపాటు ఉపాధ్యాయులు పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను అభినందించడంతోపాటు వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార నిర్వహణ ఏవిధంగా చేయవచ్చు, నగదు లావాదేవీల నిర్వహణ ఎలా? అనేది తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే వర్క్‌షాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని భాగ్యరేఖ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గుడుంబా తయారు చేసిన, విక్రయించినా చర్యలు

- మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి, ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడులు హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అల్లూరిసీతారామాతండా, ఆత్మనగర్ తండాలో తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న సంతోష్‌నాయక్, గంగాధర్‌నాయక్‌లను పట్టుకొని వారి నుంచి 10లీటర్ల గుడుంబా పారాబోశారు. 500 లీటర్ల పానకం, ముడి సరుకులను ధ్వంసం చేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఇకపై గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారీ చేసిన, తయారీకి ముడి సరకు పరఫరా చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా నాటుసారా తయారీకి కావాల్సిన వస్తువులు కొనుగోళ్లపై దృష్టి సారిస్తామన్నారు. దాడుల్లో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఏఎస్‌ఆర్‌తండాలో గుడుంబాను పట్టుకున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

కోరపల్లి రోడ్డులో తనిఖీలు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కోరపల్లి రోడ్డులో గల పలు ఇళ్లలో అబ్కారీ ఎస్ఐ సౌమ్య ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. గుడుంబా విక్రయాలు ఏమైనా జరుపుతున్నారా అనే కోణంలో కుండలు, బకెట్లు, పాత్రలు, డ్రమ్ములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గుడుంబ విక్రయాలు జరుగడం లేదని, ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీలు జరిపినట్లు తెలిపారు. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట అబ్కారీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాచ్‌మన్ నుంచి లెక్చరర్ స్థాయికి...



విజయ సంకేతం చూపుతున్న రాజ్‌కుమార్

బెల్లంపల్లి, జూలై 11: వాచ్‌మన్‌గా పనిచేసి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కొమురయ్య-పుష్పలత దంపతుల కుమారుడు రాజ్‌కుమార్. రాజ్‌కుమార్ తండ్రి పంచాయతీరాజ్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. తండ్రి మరణం తర్వాత కుటుంబానికి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. రాజ్‌కుమార్ డిప్లొమాతోనే చదువు మానేసి పది సంవత్సరాల పాటు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహించాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు చదువుకోవాలని సూచించడంతో మళ్లీ చదువుబాట పట్టాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీతోపాటు పీజీ పూర్తి చేశాడు. టెట్ రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాడు. 2017లో నిర్వహించిన ప్రభుత్వ గురుకుల పరీక్షలో టీజీటీ, పీజీటీ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో తెలుగు సబ్జెక్టులో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు, మల్టీజోన్ 1లో మూడో ర్యాంకు సాధించాడు. దీంతో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. స్నేహితులు, కుటుంబీకులు, ఉపాధ్యాయులు అభినందించారు.











ప్రభుత్వ పాఠశాలల్లో ఆరుబయటే పాఠాలు

- సరిపడా తరగతి గదులు లేక విద్యార్థుల ఇక్కట్లు

- వానాకాలంలో మరింత ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన బోధన అందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ఉపాధ్యాయులు, తరగతి గదులున్న చోట విద్యార్థులు లేకపోవడం, టీచర్లు ఉన్న పాఠశాలలకు పిల్లలు రాకపోవడంతో పాఠశాలల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గదుల కొరతతో ఆరుబయట ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై గదుల కొరత ప్రభావం తీవ్రంగా పడుతోంది. నిబంధనల ప్రకారం తరగతికి ఒక గది ఉండాలి. చాలా చోట్ల తరగతులకు సరిపడా గదులు లేవు. ముఖ్యంగా వానాకాలం ఈ సమస్య మరింతగా వేధిస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో ఒకే తరగతి గదుల్లో విద్యార్థులను ఇరుకుగా కూర్చోబెడుతున్నారు. భౌతిక దూరం పాటించాలనే నిబంధన అమలు కావడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బడి బాట కార్యక్రమాన్ని చేపట్టి చిన్నారులు, యువతను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాఠశాలలోని సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను మోడల్‌గా తయారు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో మన ఊరు మన బడి కింద పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టి నిధులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలోని ఎంపిక చేసి విద్యుదీకరణ, తాగునీరు, మూత్రశాలల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ప్రహరీ, కిచెన్ షెడ్స్ నిర్మాణాలను చేపట్టారు. చేసిన పనులకు గత ప్రభుత్వం మొదట్లో నిధులు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలలకు ముందు నుంచి తరగతి గదుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



రాజేశ్వర్‌రావుపేటలో ఆరుబయట పాఠాలు వింటున్న విద్యార్థులు

● విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు...

గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు చేర్చుకున్నారు. కానీ పాఠశాలలో తరగతి గదల కొరతతో విద్యా బోధన ఆరుబయట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలంలో విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, బండలింగాపూర్, రామలచ్చక్కపేట, కోనరావుపేట, జగ్గసాగర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడం వలన విద్యార్థులకు ఆరుబయట ఉపాధ్యాయులు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా తగినంత గదులు లేకపోవడంతో బోధన ఇబ్బందిగా కొనసాగుతోంది. పేద విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యనందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నది. ముఖ్యంగా పాఠశాలలో సరైన తరగతి గదులు, సరైన వసతులు అందుబాటులో లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల కొరత విషయాన్ని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీ సుకెళ్లినట్లు గ్రామాల్లోని మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు కోరుతున్నారు.

● ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

- భీమయ్య, ఇన్‌చార్జి ఎంఈవో, మెట్‌పల్లి

మండంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కొన్ని గ్రామాల్లోని పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేశాము. మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు నిధులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో గదుల కొరత, పలు సమస్యలు అలాగే ఉన్నాయి. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలలోని సమస్యలను పరిష్కారం అవుతున్నాయి.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



తిరుమల శ్రీవారి ఆలయంలో బండి సంజయ్‌కుమార్, కుటుంబసభ్యులు

భగత్‌నగర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం, తన పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు.

తిరుపతిలో టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు బండి సంజయ్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం అందజేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న నెమళ్లు

- ఇళ్ల మధ్య నెమలి మృతదేహం లభ్యం

గన్నేరువరం, జులై 11: మండలంలోని మైలారం గ్రామంలో జాతీయ పక్షులైన నెమల్లకు రక్షణ కరువైంది. మానేరు డ్యాం శివారులో ఉన్న మైలారం గ్రామం గుట్టల ప్రాంతం కావడంతో అక్కడ నెమల్లు, అడవిపందులు, కుందేళ్ళు, ఎలుగుబంట్లు ఉండడంతో వాటిని వేటగాళ్ళు వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గ్రామంలో వెల్లువెత్తున్నాయి. గురువారం గ్రామంలోని జనావాసాల సమీపంలో నెమలి మృతదేహం, ఈకలు కనిపించాయి. వేటగాళ్ళు నెమలిని వేటాడి చంపి మాంసంగా మార్చే ప్రయత్నంలో ఏమరపాటు మూలంగా వీధి కుక్కలు నెమలి మృతదేహాన్ని లాక్కెళ్ళి తిన్నదని విశ్వసనీయ సమాచారం. గత కొంతకాలంగా ఈ నెమల్ల వేట యథేచ్ఛగా కొనసాగుతుందని, వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వన్యప్రాణుల వేటపై దృష్టి సారించక పోవడం మూలంగా ఏకంగా జాతీయ పక్షి నెమల్లను సైతం వేటగాళ్ళు వదలటం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నెమలుల వేటపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

● ఫారెస్ట్ అధికారుల పరిశీలన..

మైలారంలో నెమళ్ల వేట విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ సాయంత్రం మైలారం గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెమలి మృతదేహం వద్ద పరిశీలించగా వారికి నెమలి ఈకలు లభించగా నెమలి కళేబరం కనబడలేదు. రాత్రి కావడంతో నెమలి మృతదేహాన్ని వెతకడం సాధ్యం కాలేదని తెలిపారు. శుక్రవారం తిరిగి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కనుగొని పంచనామా నిర్వహించి, గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

చెరువు తూములు తెరిపించాలని ఆందోళన

మల్యాల, జూలై 11: మల్యాలలోని సూరప్ప చెరువు తూములను మూసివేయడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తూములు తెరిపించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సూరప్ప చెరువులో తమకు పట్టా భూములు ఉన్నాయని వానాకాలంలో ఆ భూములు నీటిలో మునిగిపోతుండగా కొన్నేళ్లుగా యాసంగి పంట మాత్రమే చేసుకుంటున్నామని అయితే మూడేళ్లుగా చెరువు తూములు తెరవకపోవడంతో నీరు అందులోనే ఉండి పంటలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తూములు మూసి ఉండడంతో చెరువులో గల భూములు సాగు కాకపోగ, తూములు తెరువక నీళ్ల రాక చెరువు కింది భూములలో పంటలు సాగు చేయక నష్టపోవాల్సి వస్తుందని తహసీల్దార్‌తో పేర్కొన్నారు. తూములు తెరిపించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు కూడా కలిసి తమ ఆవేదన తెలిపారు. కార్యక్రమంలో రైతులు బావు శంకర్, తాటిపాముల జగదీశ్వర్, జక్కుల రాయమల్లు, సంగ సత్యనారాయణ, బావు నాగభూషనం, గడ్డి లచ్చన్న, సంతోష్ తదితరులు అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

సాంకేతికలోపంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్ క్రైం, జూలై 11: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌డౌన్‌తో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. క్రయవిక్రయదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేచి చూసి విసిగిపోయి వెళ్లిపోయారు. గురువారం రోజు వివిధ రకాల రిజిస్ట్రేషన్ల కోసం దాదాపు 50 వరకు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని కార్యాలయానికి వచ్చిన విక్రయదారులు కార్యాలయంలో సాంకేతికలోపం తలెత్తిందని అధికారులు చెప్పటంతో రోజంతా కార్యాలయం లోపల, బయట వేచి ఉన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌లింకప్ కాకుండా మొరాయించటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయయని అధికారులు తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూశారు. సాంకేతిక సమస్య పరిష్కారం అయితే ఏ సమయంలో అయినా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గురువారం రోజు స్లాట్‌ను శుక్రవారానికి అనుమతి ఇస్తామని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే సమస్యతో రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 11: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 23 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష లేదా మొత్తం ఏడు వేల జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు. మిగతా 20 మంది వాహనదారులకు 35,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

ఇద్దరు యువకుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 11 : సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డు, జూనియర్ కళాశాల వద్ద ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి సుందరయ్యనగర్‌కు చెందిన బూరాని గణేష్‌సింగ్, భోగ రాజు అనే ఇద్దరు యువకులను పట్టుకొని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారని అన్నారు. యువకులపై నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'గృహజ్యోతి' ఎడిట్ ఆప్షన్

గణేశ్‌నగర్, జూలై 11: గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి వివరాల నమోదులో తప్పులు దొర్లిన వారికి శుక్రవారం నుంచి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్లను ఇచ్చింది. నెలకు 200 యూనిట్లు వాడుతూ తెల్లరేషన్ కార్డు గల వారికి ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గతంలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని విద్యుత్ యూఎస్‌సి/ఎస్‌సి నంబర్ తప్పుగాపడి జీరోబిల్ రాని వారు ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో సరిచేసుకోవచ్చు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత

- 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 11: జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి రాకెట్ ముఠాను పట్టుకున్నారు. వీరి వద్ద 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు, రూ. 3,500 నగదును సీజ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో దొంగల ముఠాను అరెస్టు చూపించి విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి విక్రయిస్తూ రాయపట్నం గ్రామానికి చెందిన బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుపడగా దొంతాపూర్ గ్రామానికి చెందిన దుర్గం రాము తప్పించుకుని పారిపోయాడు. బుధవారం ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి గ్రామంలో పోలీసుల కల్లుగప్పి తప్పించుక తిరుగుతున్న రాము ఉన్నాడనే సమాచారం అందింది. దీంతో ధర్మపురి ఎస్ఐ ఉదయ్ కుమార్ తన సిబ్బందితో బుద్దేష్‌పల్లికి వెళ్లి గాలించగా రాముతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద 6.300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రాముతో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఒడిషా రాష్ట్రంలోని రాయగడ ప్రాంతానికి చెందిన దినేష్ కుమార్ నాయక్, మరొకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరానికి చెందిన గుజ్జల పురుషోత్తంగా గుర్తించారు. మరో ఇద్దరు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్ గంజాయిని పండిస్తూ విజయనగరానికి చెందిన పురుషోత్తంకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌కు చెందిన దుర్గం రాము ఇదే మండంలోని మగ్గిడి గ్రామానికి చెందిన అజయ్, సంజయ్‌కు ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్, విజయనగరానికి చెందిన పురుషోత్తంతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరంతా ఒక ముఠాగా ఏర్పడ్డారు. చందు, వెంకటేష్, రాము, అజయ్, సంజయ్ కలిసి ఒడిషా వెళ్లి అక్కడ రాయగడ రైల్వేస్టేషన్‌లో దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తంలను కలుసుకుని గంజాయిని కొనుగోలు చేస్తూ ధర్మపురి ప్రాంతంలో విక్రయిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలనే ప్లాన్ చేశారు. ధర్మపురి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ధర్మపురి ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పాటు ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకుని వారి గుట్టురట్టు చేశారు. ఒడిషాకు చెందిన దినేష్ కుమార్ నాయక్‌కు గతంలో ఏపీ రాష్ట్రంలో జరిగిన ఎన్‌డీపీఎస్ చట్టంలో ప్రమేయం ఉండడంతో పాటు ఒడిషాలోని షేల్‌ఖాల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదై రాయగడ జైలులో శిక్షను కూడా అనుభవించాడు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

ఏపీకి చెందిన పురుషోత్తం సైతం ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులో రాయగడ జైలుకు వెళ్లగా వీరిద్దరికి అక్కడ పరిచయం ఏర్పడినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో గతంలో బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుబడగా, తాజాగా రాము, దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తం పట్టుబడగా అజయ్, సంజయ్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో అక్రమ గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాను గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నామన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్న డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి, గొల్లపల్లి ఎస్ఐలు ఉదయ్‌కుమార్, సతీష్, పోలీస్ సిబ్బంది రమేష్ నాయక్, పూర్ణ సాయి, రమేష్, రామస్వామి, అశోక్, సలీమోద్దీన్, వెంకటయ్య, నవీన్‌ను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై ఆందోళన

- చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల డిమాండ్

కరీంనగర్ రూరల్, జూలై 11: స్త్రీనిధి సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలని గురువారం చామనపల్లి గ్రామైఖ్య సంఘాల మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. లక్షలు గోల్‌మాల్ జరుగుతుండగా, క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి గ్రామంలో 10కి పైగా మహిళా సంఘాలున్నాయని తెలిపారు. కరోనాకాలంలో సదరు సంఘాలకు శ్రీ నిధి రుణాలు 35లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వాటిని మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా ఓ కోఆర్డినేటర్ కరోనా సమయంలో రుణం సమాచారం తెలుపకుండా మహిళల ఐడి కార్డులు, బ్యాంకు ఖాతాలను సేకరించి, గుట్టుగా సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. రెండేళ్ల క్రితం అక్రమ బాగోతం వెలుగు చూడగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ డబ్బు వడ్డీతో కలిపి మొత్తం 40లక్షలకు చేరింది. మహిళలకు రుణాలు ఇవ్వకపోగా రేపు మాపంటూ తిప్పుకున్నారని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని మహిళలు ఆరోపించారు. గతంలో కరీంనగర్ రూరల్ పోలీసులకు డీఆర్‌డీఏ అధికారులకు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. న్యాయం కోసం ప్రతి రోజు పోలీస్‌స్టేషన్లు, అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని మహిళలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని శ్రీనిధి డబ్బులు, పొదుపు సంఘాల డబ్బులు ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీవో అధ్యక్షులు, గ్రామైఖ్య సంఘం మహిళలు గాలిపెల్లి కనుకలక్ష్మీ, నర్సమ్మ, రాజమ్మ, సరోజన, కనుకలక్ష్మి, సరోజన, ఈశ్వరమ్మ, అయిలమ్మ, విజయ, రమ, శారద, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న చేగుర్తి మహిళ సంఘాల సభ్యులు

ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.243 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.573 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 124 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550 రూపాయలు, కనిష్ఠ ధర 7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తెలంగాణ సంప్రదాయాలు దేశానికే ఆదర్శం

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



గవర్నర్‌తో తాడిజెర్రి ఒగ్గుకళాకారుల బృందం

గంగాధర. జూలై 11: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు దేశానికే ఆదర్శమని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఢిల్లీలో ఈనెల 9,10 తేదీల్లో లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవస్థానం, తెలంగాణ భాష సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో బోనాల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన ఈర్ల మహిపాల్ ఒగ్గు కళాకారుల బృందం గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి తెలంగాణ భవన్ వరకు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఒగ్గుడోలు బృందాన్ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడినట్లు ఈర్ల మహిపాల్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. తెలంగాణ కవులు, కళాకారుల ఆటపాటలు ప్రజలను ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కళాకారులు, కవులు, సాహితీవేత్తలు తమ కళలతో తెలంగాణ ఘనతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాబృందానికి మెమెంటోను అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు మహేందర్, గణేష్, రాము, గంగాశంకర్, అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు డ్యాంలో నీటమునిగి గొర్రెలు మృతి

● కుక్కలనుంచి తప్పించుకునేందుకు నీటిలోకి దూకిన మూగజీవాలు

గన్నేరువరం, జులై 11: మానేరు డ్యాంలో నీట మునిగి పలు గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మద్రి తిరుపతి, పేరం ముత్తయ్య, మడికంటి అశోక్‌కు చెందిన గొర్రెలను మేత కోసం గ్రామశివారులోని మానేరు డ్యాం పరిసర ప్రాంతంలో మేపడానికి గొర్లను తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో కాపరులు భోజనం చేస్తుండగా గుంపుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేశాయి. దీంతో కుక్కల భయానికి గొర్రెలు అన్నీ నీటిలోకి దూకగా సుమారు 30 గొర్లు నీటిలో గల్లంతు కాగా 70 గొర్లను అక్కడే ఉన్న మత్స్యకారులు రక్షించారు. నీటిలో మునిగిన గొర్లలో మృతి చెందిన ఆరు గొర్రెల మృతదేహాలు లభ్యం కాగా మిగతా వాటి జాడ తెలియలేదు. తమకు జీవనాధారమైన మూగజీవాలను కోల్పోయామని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధిత గొర్రెల కాపరులు వేడుకుంటున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

మల్యాల, జూలై 11: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశత్తూ జారి పడడంతో గీతకార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని మల్యాలకు చెందిన కాసారం ఆంజనేయులుగౌడ్ గురువారం కల్లు కోసం తాటి చెట్టు ఎక్కి కిందకు వస్తుండగా ప్రమాదవశత్తూ జారి కింద పడ్డాడు. దీంతో ఆంజనేయులుకు ఛాతిలో, నడుముకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

సిరిసిల్ల రూరల్, జూలై 11: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలోని గొర్రెల మందపై గురువారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయడంతో దాదాపు 20 గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన సిద్ది కనకయ్య యాదవ్ అనే గొర్రెల కాపరి తనకు ఉన్నా 40 గొర్రెలను గ్రామ శివారులోని తన ఇంటి వద్దనే ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచాడు. గురువారం తెల్లవారుజామున కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి 20 గొర్రెలను చంపి వేయగా మరో 20 గొర్రెలను గాయపర్చాయి. గురువారం ఉదయం మంద వద్దకు వెళ్లిన కనకయ్య చనిపోయిన గొర్రెలను చూసి దుఃఖ సాగరంలో మునిగిపోయాడు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలతో రెండు లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు గ్రామంలోని కుక్కలను తరలించాలని గ్రామస్థులు కోరారు.

దొంగ సొత్తు కొంటే కఠిన చర్యలు

- 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్

- 27మంది బైండోవర్

సిరిసిల్ల క్రైం, జూలై 11: దొంగ సొత్తుకొంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని స్క్రాప్ దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించిన సందర్భంగా గురువారం ఎస్పీ వివరాలు వెల్లడించారు. స్క్రాప్ వ్యాపారం మాటున అక్రమ దందా కొనసాగించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. దీంతో 27మంది వర్తకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. షాపులో కొనుగోలు, అమ్మకాల్లో ప్రతి వస్తువుకు రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. తుక్కు, స్క్రాప్‌నకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేయకూడదని ఎస్పీ తెలిపారు.

ముంబాయి పోలీసుల అదుపులో ఇద్దరు కరీంనగర్ వాసులు

-సైబర్‌క్రైం కేసులో అదుపులోకి

కరీంనగర్ క్రైం, జూలై 11: సైబర్ క్రైం కేసులో ప్రమేయం ఉందన్న కారణంగా ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ పోలీసులు గురువారం కరీంనగర్‌లో పలు చోట్ల సోదాలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ మరో నలుగురు పోలీసు సిబ్బందితో కూడిన బృందం గురువారం మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుని సుభాష్‌నగర్‌కు చెందిన ఫరూక్ అహ్మద్, ఆదర్శనగర్‌కు చెందిన వీరనాథ్‌ను అదుపులోకి కరీంనగర్ మూడో ఠాణాకు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. మరో నిందితుడు అసీముద్దీన్‌తోపాటు మరో మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతని కోసం ముంబాయి, స్థానిక పోలీసు టీం గాలిస్తున్నది. మార్చి నెలలో ముంబాయిలో బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ ఫూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ ఖాతా తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబాయి సైబర్ పోలీసులు గుర్తించి, నిందితులను విచారించేందుకు ఇక్కడికి వచ్చినట్లు సమాచారం. అంతర్జాతీ సైబర్ నేరగాళ్లతో కరీంనగర్‌వాసులకు ఉన్న సంబంధం, బ్యాంక్ లావాదేవీలపై విచారణ జరుపుతున్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురిచేస్తే చర్యలు

వేములవాడ కల్చరల్, జూలై 11 : వృద్ధాప్యంలో భరోసాగా ఉండాల్సిన సంతానం తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ డిజెబుల్ వెల్ఫేర్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్ అండ్ ట్రాన్స్‌జండర్ పర్సన్స్ శైలజ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, పీఆర్వో సిరిగిరి శ్రీరాములు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొనగా ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించి ఆలయాధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌస్‌లో శైలజ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 14567 కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సంబంధిత అధికారులను నేరుగా ఇంటికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అన్యాయం వయో వృద్ధుల ఆస్తిని వారసులు అనుభవిస్తూ వారిని నిర్లక్ష్యం చేసినట్లయితే అట్టి ఆస్తిని తిరిగి స్వాధీనం పరుచుకుని తిరిగి వయోవృద్ధులకు అందిస్తామని వివరించారు. జిల్లాలో వయోవృద్ధులు టోల్ ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, ఫీల్డ్ రెస్పెన్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు ఉన్నారు.



స్వామి వారి శేషవస్త్రాలను అందజేస్తున్న ఆలయాధికారులు

పెండింగ్ బిల్లులు ఇప్పించండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 11 : గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పించాలని బోయినపల్లి మండలంలోని గ్రామాల మాజీ సర్పంచులు కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు శంకర్, లత, నవిత, మధు మాట్లాడుతూ తాము సర్పంచులుగా పనిచేసిన సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేయించామన్నారు. చేసిన అప్పులకు వడ్డీ పెరిగిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రావాల్సిన పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు లతాశ్రీ, సుకన్య, లక్ష్మీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 11:ఎంప్లాయీస్ హెల్త్ స్కీం సక్రమంగా అమలు కాకపోవడంతో పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు బలరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌకి సుధాకర్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన నాలుగు వాయిదాలు డీఆర్‌లు విడుదల చేసి ఏకమొత్తంలో బకాయిలు చెల్లించడంతోపాటు సమస్యలపై ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మండల అధ్యక్షుడు టీవీ లక్ష్మణరావు, కార్యదర్శి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కోనరావుపేట, జూలై 11 : కోనరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలంగా పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుండగా వారిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కోనరావుపేటలో చాలా కాలంగా పనిచేసిన వినయశీల, సుల్తాన్, రాజు, దాసరి వనితలు బదిలీపై వెళ్లగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా పనిచేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఇక్కడనే ఉండండి సార్ అని ప్రాధేయపడ్డారు. కాగా ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు విధిలో భాగం కాబట్టి విద్యార్థులకు ఉపాధ్యాయులు నచ్చచెప్పారు.

వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు నగదు అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై 11: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతు కోసం పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. 1993-1994 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు పోగు చేసిన రూ.20 వేల నగదును గురువారం అందజేశారు. వాటర్ ప్లాంటు పని చేయక విద్యార్థులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన పూర్వ విద్యార్థులు తమ వంతుగా నగదును అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేందర్, దామోదర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుపై పోలీసుల దాడి అమానుషం



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్షం నాయకులు

వేములవాడ టౌన్, జూలై 11: ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల నిరసన కార్యక్రమాల కవరేజీకి వెళ్లిన రిపోర్టర్‌పై పోలీసు అధికారి దాడి చేయడం అమానుషమని అఖిలపక్షం నాయకులు అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టు శ్రీచరణ్‌పై పోలీసు అధికారి దాడిని నిరసిస్తూ వేములవాడ పట్టణంలో అఖిలపక్షం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేసే జర్నలిస్టులపై పోలీసుల దాడి హేయమైన చర్యగా పరిగణించాలన్నారు. జర్నలిస్టుపై దాడి చేసిన సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం నాయకులు నిమ్మశెట్టి విజయ్‌కుమార్, రేగుల సంతోష్‌బాబు, గోలి మహేష్, ఈర్లపెల్లి రాజు, వెంగళ శ్రీకాంత్, ముద్రకోల వెంకటేష్, కడారి రాములు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కోనరావుపేట, జూలై 11 : కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో గురువారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన దర్శనాల స్వప్నకు రూ.10,500, నూకలమర్రి మౌనికకు రూ.9 వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ నాయకులు నందు గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మానాల మోహన్‌రెడ్డిని కలిసిన గ్రామస్థులు

రుద్రంగి, జూలై 11: తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా గురువారం హైదారాబాద్‌లో బాధ్యతలు చేపట్టిన రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన నిజామాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని గ్రామస్థులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ జనరల్ సెక్రెటరీ జక్కు వంశీ, జక్కు మోహన్, దీలీప్ పాల్గొన్నారు.

ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిపేట, జూలై 11: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు గురువారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు లక్ష్మారెడ్డి, నరేశ్, రాజిరెడ్డి, గాల్‌రెడ్డి, కుమార్, సంజీవరెడ్డి, రవి, ప్రదీప్‌రెడ్డి, వేణు, రవిశంకర్, రాజు, అరవింద్, అబ్దుల్, దయాకర్, సాయి, కృష్ణారెడ్డి, దేవదాస్, సత్యంరెడ్డి, సాయికిరణ్, మోహన్, అజయ్, బాలకిషన్, భాస్కర్ పాల్గొన్నారు.

ఒడిస్సా రాష్ట్రంలో జగన్నాథుడు కొలువుదీరిన పూరీ తీరంలో బండి సంజయ్ సైకత శిల్పాన్ని వేయించి ఎల్లారెడ్డిపేట మండలం పదిరకు చెందిన బీజేపీ యువమోర్చా జిల్లా నాయకుడు బోనాల సాయికుమార్ అభిమానాన్ని చాటుకున్నాడు. సాయికుమార్ ఉపాధి నిమిత్తం కేరళ రాష్ట్రంలో నివసిస్తున్నాడు. సైకత శిల్పి నికోంజ కిషోర్ చేత శిల్పాన్ని వేయించాడు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో బండి సంజయ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బీజేపీ నాయకులు, బీజేవైఎం నాయకులు కాసుగంటి రాజు, చిందం నరేష్, ఆసాని రామలింగారెడ్డి, సిరిసిల్ల వంశీ, తిరుపతి రెడ్డి, రాజు, కాలి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలోని అతి పురాతన సీతా రామాలయంలో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, మాజీ సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధులు గడ్డమీది ప్రసాద్‌రెడ్డి, దెవసాని కృష్ణ, నాయకులు కృష్ణకాంత్ యాదవ్, కోడె రమేష్, పత్తి స్వామిరాజు, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, లక్ష్మీపురం రాజు, స్వామి. సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కలు నాటారు. పోతుగల్ ప్రాథమిక పాఠశాలలో కోల కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మెంగని మహేందర్, వరి వెంకటేశ్, కుడుకల జనార్దన్, తిరుపతి, మల్లారెడ్డి, మిరుదొడ్డి సత్తయ్య, మహేశ్, చిగురు వెంకన్న, రంజిత్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.



రాజన్నకు కోడెమొక్కు చెల్లిస్తున్న ప్రతాప రామకృష్ణ, నాయకులు

జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, జిల్లా కార్యదర్శి లక్పతి నాయక్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, కార్యదర్శి పిట్ల నాగరాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు బండారి మహేష్, జిల్లా దిశా కమిటీ సభ్యులు బట్టు పీర్యా, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు వేములవాడ రాజరాజేశ్వరస్వామికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అర్బన్ మండలంలోని నాయకులు నందికమాన్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, నామాల శేఖర్, సంటి మహేష్, జింక అనిల్, సగ్గు రాహుల్, కొమ్మనవేణి సంతోష్, గుండకార్ల లక్ష్మణ్, ఎరగొక్కుల రమేష్, గణేష్, కట్ట శ్రీకాంత్, శ్రీధర్, మధు, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

చందుర్తి : చందుర్తి బస్టాండ్ ఆవరణలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మల్యాలలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోంచేటి రాకేష్, నాయకులు చిర్రం తిరుపతి పెరిక గంగరాజు వంకాయల కార్తీక్, బండెల వెంకటేష్, కూతురు మహేందర్ రెడ్డి, ఉగిలే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా...

సిరిసిల్ల రూరల్ సిరిసిల్ల పట్టణంలో బీజేపీ వర్గపోరులో ఉన్న నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండిసంజయ్ జన్మదిన వేడుకలను గురువారం పోటాపోటీగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని ఆర్యవైశ్య భవనం ఎదుట అన్నదానం చేపట్టారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు అధ్వర్యంలో విశ్వనాథస్వామి ఆయలంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతోపాటు కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలంరాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు అన్నల్‌దాస్ వేణు, బూర విష్ణువర్ధన్ అధ్వర్యంలో స్థానిక వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో రక్త దానం చేశారు. 10వ వార్డు కౌన్సిలర్ సైతం రక్తదనం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు, కౌన్సిలర్లు బొల్గం నాగరాజుగౌడ్, గుడూరి భాస్కర్, దాసరి శ్రీనివాస్, మోర శ్రీహరి, చొప్పదండి అంజన్న, మ్యాన రాంప్రసాద్, ఉరగొండ రాజు, గుడ్ల విష్ణు, గాజుల వేణు, కోడం అనంద్‌బాబు, పంపరి అర్జున్, గుండెల్లి వేణుగోపాల్, అంకారపు రాజు, పోతు శ్రీనివాస్, సుంకరి బాలకిషన్, కోడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంతోపాటు మల్కపేట గ్రామంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా, మండల నాయకులు సురేందర్‌రావు, బాలాజీ, అంబోజ లక్ష్మినారాయణ, రామచంద్రం, రవి, తిరుపతి, నాగరాజు, జలందర్, గణేష్ పాల్గొన్నారు.

రుద్రంగి : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు పడాల గణేష్, అల్లూరి రవీందర్, బోయిని రాజు, కర్ణవత్తుల వేణు, కిషన్, నితిన్ పాల్గొన్నారు.



సిరిసిల్ల బీజేపీ పట్టణ కమిటీ అధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



సిరిసిల్ల పాతబస్టాండ్‌లో అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు



రుద్రంగిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

డీఎస్సీ వాయిదా వేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 11: డీఎస్సీ వాయిదా వేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణం నేతన్న చౌక్ వద్ద బీఆర్ఎస్వీ నాయకులు నోటికి నల్ల గుడ్డలతో మోకాళ్లపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, అభ్యర్థులపై లాఠీచార్జి ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, నిరుద్యోగుల అభ్యర్థనలను స్వీకరించాలని అన్నారు. పోస్టులను పెంచి మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోస్టులు పెంచాలని అభ్యర్థులు నిరసన తెలిపితే కవరేజీకి వెళ్లిన పాత్రికేయులపైనా లాఠీచార్జి అమానుషమన్నారు. నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులపై దాడులు చేయడమే ప్రజాపాలనా? అంటూ ప్రశ్నించారు.బీఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, అరవింద్, కోడం వెంకటేష్, శ్రీనివాస్, తిరుపతి, వంశీ, రోహిత్, రవితేజ, నరేష్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై వినియోగదారుల ఆగ్రహం

తంగళ్లపల్లి, జూలై 11: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని వినియోగదారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సెస్ తంగళ్లపల్లి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, ఫోర్త్ మెంబర్ రాజాగౌడ్‌కు సమస్యలను వివరించారు. కొంత మంది రైతులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని వేదిక దృష్టికి తీసుకొచ్చారు. ప్రచారం, ప్రకటనలు లేకుండానే వేదికను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. పది మంది లేకుండా వేదిక కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెస్ అధికారులు, సీజీఆర్ఎఫ్ అధికారులు కుమ్మకయ్యారని ఆరోపించారు. అనంతరం మీటర్ రీడింగ్ 21 రోజులకే తీస్తున్నారని బిల్లు మాత్రం 31 రోజులకు వస్తోందని బియ్యంకార్ శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు.



ఫిర్యాదు చేస్తున్న విద్యుత్ వినియోగదారులు

సూక్ష్మ రుణాల వసూళ్లు నిలిపివేయాలి

సిరిసిల్ల టౌన్, జూలై 11 : సిరిసిల్లలో పవర్‌లూం పరిశ్రమ పనులు ప్రారంభమయ్యే వరకు బ్యాంకులు కార్మికుల నుంచి సూక్ష్మ రుణాలు వసూలు చేయడం నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల ప్రాంతంలో దాదాపు 30వేల కార్మిక కుటుంబాలు పవర్‌లూం పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నా యన్నారు. కార్మికులకు ఆరు మాసాలుగా ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోవడం కోసం బ్యాంక్‌లలో సూక్ష్మ రుణాలను తీసుకున్నారన్నారు. బ్యాంకులు కార్మికుల ఆర్థిక అవసరాలను ఆసరాగా తీసుకొని అధిక వడ్డీలకు ఒక్కొక్కరికి రెండు, మూడు సార్లు రుణాలు ఇచ్చాయన్నారు. ఉపాధి లేక ఇల్లు గడవక అప్పులు చేస్తే తిరిగి చెల్లించాలంటూ బ్యాంకులు ఒత్తిడి తీసుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించాలని, సూక్ష్మ రుణాలు ఇస్తున్న బ్యాంక్‌లతో మాట్లా డాలని కోరారు. లేని పక్షంలో రుణాల వసూలుకు వచ్చే బ్యాంక్ సిబ్బందిని సీపీఐ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చ రించారు. సమావేశంలో సీపీఐ నాయకులు పంతం రవి, అజ్జ వేణు, సోమ నాగరాజు, నల్ల చంద్రమౌళి పాల్గొన్నారు.

4న అఖండ భజన

ఎల్లారెడ్డిపేట, జూలై 11: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లో ఆగస్టు 4న నిర్వహించనున్న అఖండ భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజు గురుస్వామి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బొప్పాపూర్ జ్ఞానదీప్ హైస్కూల్‌లో భజనకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. సేవా సమితి వ్యవస్థాపకులు రాజు దేశపాండే పిలుపు మేరకు 'నీ గానమే నా ప్రాణం' అనే నినాదంతో అఖండ భజనను నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, శ్రీనుగురుస్వామి, చంద్రం, కిరణ్, మధు, భాస్కర్, శ్రీనివాస్, రాజు, రమేశ్, వీరాచారి, దేవరాజు, సుధాకర్, వెంకన్న పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలి



భోజనం వడ్డిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

సిరిసిల్ల టౌన్, జూలై 11 : నిరుద్యోగులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని అన్నపూర్ణ క్యాంటీన్, సినారె జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, విద్యార్థుల తో చైర్ పర్సన్ మాట్లాడారు. అనంతరం గ్రంథాలయం ఆవరణలో సిరిసిల్ల మున్సిపల్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో ఐదు రూపాయలకే అన్నపూర్ణ భోజనశాలను చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్ లావణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వందలాది మంది నిరుద్యోగులు, విద్యార్థులకు ఐదే ళ్లగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. చైర్ పర్సన్ వెంట మున్సిపల్ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, గ్రంథాలయం అధికారులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 11: సిరిసిల్ల పట్టణంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)నాయకులు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టిం చుకోవడం లేదని, అక్రమంగా నిర్మాణం చేపడు తున్నారని గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం మినీస్టేడియం వద్ద సర్వే నంబరు 863, 864బీలో అక్రమంగా ప్రహరీ నిర్మించారని, మున్సిపల్ అధికారు లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసు కోలేదని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా దాదాపు 11 ఎకరాల స్థలంలో ప్రహరీ నిర్మించ డంలో రాజకీయ ప్రముఖులు, మున్సి పల్ అధికారుల ప్రమేయం ఉండవచ్చన్నారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మచ్చ అనసూయ, జక్కని త్రివేణి, బొడ్డుల శ్రీహరి, తడక రాములు, సత్య నారాయణ, సత్తయ్య, తారకరాములు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం వద్దు

సిరిసిల్ల రూరల్, జూలై 11: పవర్‌లూం కార్మికుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని, వారికి ఉపాధిని కల్పించడంతోపాటు వర్కర్ టూ ఓనర్ పథకాన్ని పూర్తి చేసి కార్మికులకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన వార్పిన్ కార్మికుడు గాజుల వేణు ఉపాధి లేకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడిని గురువారం సీపీఎం, సీఐటీయూ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పవర్‌లూం అనుబంధ రంగాల్లో వార్పిన్ కార్మికుడిగా పని చేస్తున్న వేణుకు ఎనిమిది నెలలనుంచి ఉపాధి లేకపోవడం, కుటుంబ పోషణ భారంగా మారిపోవడం వంటి పరిణామాలతో ఇబ్బందులు పడ్డాడని పేర్కొన్నారు. సిరిసిల్లలో నేతన్న పరిస్థితి దయనీయంగా మారిపోయిందన్నారు. ఉపాధిలేక కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం సిరిసిల్ల నియోజకవర్గ కేంద్రంలో పర్యటించి నప్పుడు బండి సంజయ్‌కి నేతన్నల ఆత్మహత్యలు, కార్మికుల దుర్భర జీవితాలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను పరామర్శించాల్సిన సోయి లేకుండా పోయిందన్నారు. వస్త్ర పరిశ్రమ ఇన్ని రోజులు బంద్ ఉన్నా సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడంరమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్యం, గౌరవ అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడ రూరల్, జూలై 11: మండలంలోని మర్రిపల్లి గ్రామంలో మాల సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంఘం నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ రూరల్, జూలై 11: ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. మండలంలోని వట్టెంలలో పోలీసులు గురువారం రాత్రి గ్రామస్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్టు తప్ప నిసరి ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. . వాహనాలను వేగంగా నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని ఎట్టిపరిస్థితుల్లో వాహనాలను ఇవ్వద్దని అన్నారు. ఆమె వెంట రూరల్ ఎస్సై మారుతి తదితరులు ఉన్నారు.

చందుర్తి : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు అతివేగంగా నడప వద్దన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. అతివేగంతో వెళ్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కోనరావుపేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోనరావుపేట ఎస్సై అంజనేయులు అన్నారు. మండలంలోని నిజామాబాద్ ఎల్లమ్మ గుడి ఆవరణలో గురువారం హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీ నిరంతర ప్రక్రి యని, హెల్మెట్ ధరించని వారిపై నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.

ఘనంగా కొండూరు రవీందర్‌రావు జన్మదిన వేడుకలు



సిరిసిల్ల పెద్దూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 11 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో గురువారం న్యాప్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు ఆధ్వర్యంలో కేక్ చేశారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ బెజ్జారపునారాయణ గౌడ్, డైరెక్టర్‌లు సలేంద్రి బాలరాజుయాదవ్, తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, అదిపెల్లి నారాయణగౌడ్, లడ్డుబాయ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షేక్అలీ, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య తిరుపతి నాయక్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లు, నాయకులు వేడుకలను నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ సత్తయ్య, డైరెక్టర్లు వెంకటనర్సింహారెడ్డి, ఎల్లయ్య, నాయకులు నర్సింలు, బాల్‌రెడ్డి, హసన్, లక్ష్మణ్, మల్లయ్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలం మండపల్లి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, పడిగెల మానసరాజు, బండి దేవదాస్, కోడూరు భాస్కర్ గౌడ్, మాట్ల మధు, వలకొండ వేణుగోపాల రావు, ఎగుమామిడి రమణారెడ్డి, గనప శివజ్యోతి, గణప మదన్‌రెడ్డి, కోడం సంధ్యారాణి పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. అంతకు ముందు గోరంటాల సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ వెళ్లి కొండూరు రవీందర్ రావును పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, సింగిల్‌విండో వైస్ చైర్మెన్ రామాంజనేయులు, మాజీ జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయలక్ష్మన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దయాకర్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.



ఎల్లారెడ్డిపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు